వైద్యుల ప్రాణాలు తీసేవారిని శిక్షించాలి



దైవ సమానులైన వైద్యులపై దాడులు హేయమైన చర్య. మానవ ప్రాణాలు కాపాడేందుకు పగలు, రాత్రి తేడా అన్న తేడా లేకుండా విధులు నిర్వహిస్తారన్నారు. అలాంటి మాపై దాడులు చేయడం శోచనీయం. ప్రభుత్వాలు వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు వారి రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ వాసుదేవ, రైల్వేకోడూరు

వైద్యులకు భద్రతలేకుండా పోయింది



వైద్యులపై దాడులు, మహిళా వైద్యులపై అఘాయిత్యాలు చేస్తుండటం దారుణం. ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందికి భద్రతలేదు. ఉన్నత లక్ష్యాలతో పనిచేస్తున్న వైద్యులపై ఇలాంటి దాడులు జరగడం బాధాకరం. ఆస్పత్రుల్లో రక్షణ చర్యలు తీసుకోవాలి. వైద్యులపై దాడికి పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తేనే ఇలాంటి ఘటనలు నియంత్రించగలము.

– డాక్టర్ వెంగల్ రెడ్డి, కోడూరు



ఇది తలదించుకునే సంఘటన



కలకత్తా మహిళా డాక్టర్‌పై జరిగిన సంఘటన దారుణం. యావద్దేశాన్ని కుదిపేసింది. సభ్య సమాజాన్ని కలచివేసింది. ఇది సమాజంలో తలదించుకునే సంఘటన. ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లు రోడ్లు పైకి రావాల్సి రావడం విచారకరం. వైద్యులపై దాడులు జరక్కుండా చూడాలి. ఆసుపత్రుల్లో పనిచేసే వారికి తగిన రక్షణ కల్పించాలి.

– శ్రీధర్, మండల వైద్యాధికారి, కురబలకోట

డాక్టర్లకు రక్షణ కల్పించాలి



దేశవ్యాప్తంగా డాక్టర్లకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. అనారోగ్యంతో, ప్రమాద సమయాల్లో ఆస్పత్రులకు వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ లేకపోవడం బాధాకరం. కలకత్తాలో జరిగిన సంఘటనలో నిందితులను ఉరి తీయాలి. ఆస్పత్రుల్లో అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ ఆశాలత, తంబళ్లపల్లె

క్లుప్తంగా

నేడు మెగా జాబ్‌మేళా

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం సప్తగిరి ఎంటర్‌ప్రైజస్ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమం జరుగునని డిక్సన్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్‌బాబా, సప్తగిరి ఎంటర్‌ప్రైజస్ వారు శంకర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు శనివారం ఉదయం సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగే ఇంటర్వ్యూకు ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

రాయచోటి టౌన్ : శ్రావణ మాసం కావడంతో ఈ మాసాంతం ప్రతి శుక్రవారం ఎంతో భక్తి శ్రద్ధలతో మహిళలు ఉపవాసాలతో నాగుల చవితి పండుగను నిర్వహిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం రాయచోటి పట్టణ, రూరల్ పరిధిలోని మహిళలు సమీపంలోని పుట్ట వద్ద నాగుల చవితి పూజలు నిర్వహించారు. నాగులకు (పుట్ట చుట్టూ) నోములు (దారాలు) చుట్టి పసుపు, కుంకమలతో పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

వీరబల్లి : మండల పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించి వివిధ సమస్యలపై అక్కడ ఉన్న సిబ్బందితో చర్చించారు. ఈయన గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

రాజంపేట టౌన్ : రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. మహోత్సవాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచి విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాల వితరణతోపాటు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు సత్కారం

నందలూరు : నల్లతిమ్మయ్యగారిపల్లి పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన మల్లికార్జున, జాషువాలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయ, పీలేరు ఏపీఎస్‌ఆర్‌జేసీలలో సీట్లు సాధించినందుకు పాఠశాల అధ్యాపక బృందం ఇద్దరు విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తూములు శిథిలావస్థ.. అధికారులు నిద్రావస్థ

- బ్రిటీష్ కాలంలో సున్నం బ్రిడ్జి నిర్మాణం
- ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధికి నోచుకోని వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



రక్షణగోడ లేకుండా ప్రమాదకరంగా ఉన్న పెనగలూరు చెరువు కాలువపై ఉన్న బ్రిడ్జి



తుప్పు పట్టిన బ్రిడ్జి తలుపులు

పెనగలూరు : పెనగలూరు చెరువుకు నీరు వచ్చే కాలువ బ్రిడ్జి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ కాలువ బ్రిడ్జి ఎగువ సిద్దవరం సమీపంలో చెయ్యేరు నది ఆనుకొని నిర్మించారు. పెనగలూరు చెరువుకు నీరు వెళ్లాలంటే చెయ్యేరు నదిలో నీరు పారుతూ ఈ బ్రిడ్జి గుండానే చెరువుకు నీరు వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలు చేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ బ్రిడ్జిని బ్రిటీష్ కాలంలో నిర్మించారు. అప్పట్లో నాలుగు తలుపులు పెట్టి సున్నంతో దీనిని నిర్మించారు. కాలువపై బ్రిడ్జిని ఎత్తుగా నిర్మించడంతో ఇటు పాదచారులకు, వాహనదారులకు భయం గుప్పెట్లో వెళ్తున్నారు. బ్రిడ్జి పైభాగాన వెడల్పు తక్కువగా ఉండటంతో వాహనం వస్తే మనిషి క్రాస్ అయ్యేందుకు అవకాశం ఉండదు. చిన్న వాహనాలు తప్ప పెద్ద వాహనాలు ఈ బ్రిడ్జిపై వెళ్లేందుకు వీలు లేదు. నదిలో నీరు పుష్కలంగా ఉన్నట్‌లైతే నాలుగు తూములను పైకెత్తి చెరువులోకి నీరు వదలడం జరుగుతోంది. చెరువు నిండిన వెంటనే తలుపులు మూసివేస్తారు.

ఎగువసిద్దవరం ప్రజలు చెయ్యేరు నదిలోకి రావాలన్నా, బ్రిడ్జి అవతల వైపు ఉన్న పొలాలకు వెళ్లాలన్నా బ్రిడ్జి పై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడ పూర్తిగా పడిపోవడంతో భయం గుప్పెట్లో ప్రజలు వెళ్తున్నారు. ఇక వాహనాల రాకపోకలు పూర్తిగా రద్దు చేసుకున్నారు. బ్రిడ్జి పైభాగంలో వెడల్పు తక్కువగా ఉండటంతో అధిక లోడుతో వాహనాలు వెళ్తే కూలిపోతుందన్న భయం వాహనదారులలో ఉంది. ఈ బ్రిడ్జిని పునఃనిర్మించాలని సిద్దవరం ప్రజలు, పెనగలూరు చెరువు క్రింద భూములు ఉన్న రైతులు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా బ్రిడ్జి గురించి నాయకులు పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు తెలియజేస్తున్నారు.

బ్రిటీష్ హయాంలో నిర్మాణం

ఈ బ్రిడ్జిని బ్రిటీష్ కాలంలో నిర్మించినట్లు పెద్దలు తెలిపారు. అప్పటి బ్రిటీష్ వారు సున్నంతో బ్రిడ్జిని నిర్మించడంతో రక్షణ గోడలు పడిపోతున్నాయి. 1975లో సిద్దవరం సర్పంచ్ బత్తల రాఘవరెడ్డి మరమ్మతులు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ బ్రిడ్జిని తలుపులు మార్చి శాశ్వత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నిర్మాణం చేపట్టకుంటే ప్రమాదమే



చెయ్యేరు నది నుంచి పెనగలూరు చెరువుకు వచ్చే కాలువపై ఉన్న బ్రిడ్జిని పునఃనిర్మించకుంటే ఎప్పటికైనా ప్రమాదం తప్పదు. కొత్త తూములు ఏర్పాటు చేసి నూతన బ్రిడ్జిని నిర్మించినట్లయితే చెరువుకు నీరు తీసుకువచ్చేందుకు సులువుగా ఉంటుంది. రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. గ్రామస్తులు తమ పొలాలకు వెళ్లేందుకు నిత్యం ఈ బ్రిడ్జి గుండా ప్రయాణిస్తుంటారు.

– అబ్బినేని సుబ్బానాయుడు, నీటి సంఘం అధ్యక్షులు పెనగలూరు

బ్రిడ్జిని వెడల్పు చేయాలి



సిద్దవరం ప్రజలు రోజూవారీ పనులు నిమిత్తం బ్రిడ్జి పై నుంచి వెళ్లాల్సింది. బ్రిడ్జిని వెడల్పు చేసి రక్షణ గోడ నిర్మించినట్లయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వరద ఎక్కువ ఉంటే రక్షణ గోడలు కొట్టుకుపోతే గ్రామం వరద నీటితో నిండిపోతుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని అధికారులు బ్రిడ్జిని పునఃనిర్మించాలి. ఉన్నతాధికారులు ఈ విషయంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి.

– రాఘవరెడ్డి ప్రేమలతా రెడ్డి, సర్పంచ్, సిద్దవరం

బ్రిడ్జిపై వెళ్లాలంటే భయమేస్తోంది



నా పొలానికి వెళ్లాలంటే కచ్చితంగా బ్రిడ్జిని మీద నుంచే వెళ్లాలి. దీనిపై నడిచివెళ్లాలంటే భయమేస్తోంది. రాళ్లతో కూడిన దారి, రక్షణ గోడలేకపోవడంతో భయం గుప్పెట్లో వెళ్లాల్సి వస్తుంది. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో తెలియదు. రక్షణ గోడ నిర్మించి బ్రిడ్జిని పునఃనిర్మించాలి. బ్రిడ్జి ఆవశ్యకతను అధికారులు తెలుసుకొని పనులు చేపట్టాలి.

– చాపల చెంగల్‌రెడ్డి, రైతు, ఎగువ సిద్దవరం

టంగుటూరికి ఘన నివాళి



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ రవిశంకర్

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కమాండెంట్ పి.రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టంగుటూరి ప్రకాశం పంతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, అసిస్టెంటు కమాండెంట్‌లు ఎం.థియోఫిలాస, ఆర్.విల్సన్‌కేర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరి

నందలూరు : భారత స్వాతంత్య్ర ఉద్యమంలో చేరి తన న్యాయవాది వృత్తికి స్వస్తిపలికి యావదాస్తిని దేశ సేవకై వినియోగించిన గొప్ప స్వాతంత్య్ర సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులని వక్తలు కొనియాడారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శిల్పి ఆనందాచారి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, బోగా వెంకటసుబ్బయ్య, గొంటుముక్కల వెంకటరమణ, తులసీ, స్వర్ణలత, గీత, రమణమ్మ, జ్యోతి, ప్రియా, గౌరీ, ప్రమీల రాహేల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సమస్యలను పరిష్కరించుకుందాం

రాజంపేట రూరల్ : గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామసభలు దోహదపడతాయని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని మందపల్లి, ఆకేపాడులలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలలో ఎమ్మెల్యే ఆకేపాటి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శ్రీహరి, ఎ.చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: మందపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు హస్తవరం వెంకటరెడ్డి (80) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, హస్తవరం సుబ్బరామిరెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, గుండు మల్లికార్జున, గుండు గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, మహబూబ్ బాషా, ఆకేపాటి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలిమామిడివారిపల్లిలో అడిషనల్ సీసీఎల్‌ఏ

పెద్దతిప్పసముద్రం : పులికల్లు పంచాయతీ చలిమామిడివారిపల్లికి శుక్రవారం సాయంత్రం అడిషనల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్ (అడిషనల్ సీసీఎల్‌ఏ) అధికారి ప్రభాకర్‌రెడ్డి విచ్చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డీటీ విద్యాసాగర్, వీఆర్వో షంషాద్‌లు అడిషనల్ సీసీఎల్‌ఏను మర్యాద పూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో భాగంగా బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు వెళుతూ మార్గమధ్యంలోని చలిమామిడివారిపల్లిలో ఉన్న సమీప బంధువు రంగారెడ్డి ఇంటికి అడిషనల్ సీసీఎల్‌ఏ వచ్చి వెళ్లినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

రాజంపేట రూరల్ : శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వేదమంత్రాలతో కమనీయంగా కనుల విందుగా నిర్వహించారు. మండల పరిధిలోని వెంకటరాజంపేట గ్రామంలో శుక్రవారం ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలయ్య ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. వేదపండితులు సుబ్బరాయ శర్మ, నాగరాజశర్మ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని వైభవంగా జరిపారు. పెద్దఎత్తున గ్రామ ప్రజలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామోత్సవం వేడుకగా సాగింది.



కల్యాణ వేడుక జరుపుకున్న ఉత్సవమూర్తులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సంబేపల్లె : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మండల ప్రత్యేక అధికారి తేజస్విని పేర్కొన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలు గుర్తించి ప్రణాళికలు రూపొందించుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కవితారమేశ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పెనగలూరు : సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి చెంగల్రాయుడు అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా 16 పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. పెనగలూరు సచివాలయంలో ఉప సర్పంచ్ జీపూరి చిన్న వెంగల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు ప్రత్యేకాధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి తోపాటు ఈఓపీఆర్‌డీ సుబ్బరాయుడులు మాట్లాడుతూ పెనగలూరు పంచాయతీలో అవసరమైన పనులను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి గ్రామసభ కార్యక్రమం శుక్రవారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభ పూర్తిగా ఎన్డీఏ కూటమి కార్యకర్తల ఆత్మీయ సభగా మారింది. సభలో సామాన్య ప్రజలు లేక వెలవెలబోయింది.

చిన్నమండెం : గ్రామ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ దివ్య అన్నారు. శుక్రవారం చిన్నమండెం మండల కేంద్రంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి సమస్య, రోడ్లు, రహదారులు, ఉపాధి హామీ పథకం పనులు, వీధిలైట్లు, డ్రైడే సమస్యలు తమ దృష్టికి ప్రజలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహించిందని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. సిద్దవటం మండలం లోని అన్నీ గ్రామ పంచాయతీలలో శుక్రవారం సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలోని గ్రామసభలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కార దిశగా ముందుకు గ్రామ కార్యదర్శులు ముందుకు సాగాలన్నారు. అనంతరం సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు.



ఒంటిమిట్ట: బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



వీరబల్లి: గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ

మొక్కుబడిగా ఒంటిమిట్ట గ్రామసభ

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభలకు సంబంధించి మండల పరిధిలోని 13 పంచాయతీలలో శుక్రవారం మొక్కుబడిగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మండల అధికారుల ఆధ్వర్యంలో డ్వామా ఏఓ మైథిలి అధ్యక్షతన ఈ సభలు నిర్వహించారు. ఈ సభలలో మండలంలో రూ.4.8 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు ఎస్టిమేషన్ వేయడం జరిగిందన్నారు. ఒంటిమిట్ట పంచాయతీలో జరిగిన గ్రామ సభకు సర్పంచ్, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి హాజరు కాకపోవడం గమనార్హం.

సుండుపల్లె : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో చేపట్టిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ప్రాధాన్యత ప్రకారం నూతన పనులను గుర్తించుటకు మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాలిక్ బాషా మాట్లాడుతూ గ్రామ సభలు ద్వారా గ్రామాలలో అవసరాలను గుర్తించడం, అందుకు తగ్గ అభివృద్ధి పనుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామసభలలో ప్రజా ప్రతినిధులు, ఉపాధిహామీ వేతనదారులు, రైతులు, స్వయం సహాయక సంఘం సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



చిన్నమండెం: సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గాలివీడు : ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు సజావుగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ గ్రామపంచాయతీ పేరుతో ప్రారంభించిన గ్రామ సభల్లో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, విద్యుత్, కుళాయి, వంటగ్యాస్ కనెక్షన్లు, ఉపాధి హామీ పనులు, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లు, ఇంకుడు గుంతలు, పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి, ఉపాధిపై చర్చించారు.

వీరబల్లి : మండలంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలలో అనేక సమస్యలను సభలు ద్వారా అధికారల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ గ్రామ సభలు ద్వారానైనా తమ సమస్యలు తీరేనా అని ప్రజలు పెదవి విరిచారు. గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని పలువురు గ్రామ సభలలో తెలిపారు. అలాగే గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, చాలా గ్రామాలలో మురికినీటి కాలువలు, వీధిలైట్లు, సీసీ రోడ్లు ఇప్పటికీ లేవని అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. ఈ గ్రామ సభలు ఆయా గ్రామాలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రామ సభలలో ప్రజలు తమ గ్రామాలలోని సమస్యలను రాతపూర్వకంగా అధికారులకు అందజేశారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

సిద్దవటం : విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి మంచి పరిశోధనలు చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సిద్దవటం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీరాములు సూచించారు. మండల కేంద్రంలోని పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయులు దత్తాత్రేయ, రవి సహకారంతో విద్యార్థులు చంద్రయాన్ రాకెట్ నమూనాను తయారు చేసి ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామలింగరాజు, మరి కొందరు ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుల్లంపేట: చిత్రలేఖనం పోటీలలో గీసిన చిత్రాలతో విద్యార్థులు

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు బి.మల్లికార్జున ఆధ్వర్యంలో అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఇదేరోజు అనగా ఆగస్టు 23వ తేదీ 2023న భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ ఈ రోజున జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని తెలియజేశారన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇస్రో భవిష్యత్తులో చేపట్టబోయే గగన్‌యాన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో జీవన ప్రయోజనాలు మెరుగు

సంబేపల్లె : అంతరిక్ష పరిశోధనలతో జీవన ప్రయోజనాలు మెరుగవుతాయని జిల్లా సైన్స్ అధికారి ఓబుళరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రెడ్డెయ్యరెడ్డి, రామయ్య, రెడ్డెయ్య, నబీ సాహెబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీలను పరామర్శించిన ఎంపీపీ



వైస్ ఎంపీపీ అనుదీప్‌ను పరామర్శిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు : మండల ఉపాధ్యక్షులు నాయనపల్లి అనుదీప్, తుమ్మల భావనలను శుక్రవారం సాయంత్రం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పరామర్శించారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి వైస్ ఎంపీపీలపై దాడికి యత్నించారు. ఈ సంఘటన జరిగిన సమయంలో ఎంపీపీ అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగసుబ్బయ్య, తుమ్మల శ్రీధర్, ఓట్స్ శ్రీను, కాకి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి అభివృద్ధిపై దృష్టి పెట్టండి

రాయచోటి టౌన్ : రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో కన్నా రాయచోటి చాలా వెనుకబడిన ప్రాంతం ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి వినతిపత్రాన్ని సమర్పించారు. శుక్రవారం రాజంపేట ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయనతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వీటి పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



రాయచోటి టౌన్: డిప్యూటీ సీఎంను కలసిన రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న మంత్రి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణ రెడ్డిపల్లె పంచాయతీ పొన్నేరువాండ్లపల్లె ఆలయంలో కుంభాభిషేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన శ్రీ గుర్రప్ప స్వామి వారి నూతన ఆలయ బింబ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

కడప ఎడ్యుకేషన్ : కళాశాలల్లో ర్యాగింగ్ అనేది చట్టరీత్యానేరం అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ చట్టరీత్యా నేరం అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను మానసిక లేదా శారీరక హింసకు గురిచేయడమనేది నేరం అన్నారు. అలాగే లైగింక వేధింపులు, స్వలింగ సంపర్క దాడులు, బట్టలు విప్పడం వంటి చర్యలను కూడా చేపట్టకూడదన్నారు.